# కలుపు మొక్కలు

ఆలియా-అవి




రాజా, రాము, రవి ముగ్గురూ మంచి స్నేహితులు. వీళ్ళు నాల్గవతరగతి చదువుకుంటున్నారు. వీళ్ళ ముగ్గురి ఇళ్ళు ఒకే వీధిలో ఉండడంతో వీళ్ళు కలిసి స్కూలుకు పోతుంటారు. కలిసి ఆడుకుంటారు. ఎక్కడికెళ్ళినా ముగ్గురూ కలిసే వెళ్తారు.

కాలువ గట్టున రామయ్య అనే ఆసామి ఇల్లు ఉంది. ఆ ఇంటి చుట్టూ తోటలో జామ, సపోటా, మామిడి మొదలైన రకరకాల పండ్ల చెట్లూ, కూరగాయల మొక్కలూ, పాదులూ, రకరకాల పూల చెట్లూ, పూల మొక్కలూ నిండి ఉన్నాయి. రామయ్య తన తోటలోని ఫలపుష్పాదులమ్మి వ్యవసాయం చేసి జీవనం గడుపుతున్నాడు.

రాజా, రాము, రవి షికారుకని కాలువగట్టు మీదుగా పోతూ రామయ్య తోటను చూశారు. నెమ్మదిగా ఎవరూ చూడకుండా లోపలికి ప్రవేశించి జామకాయలు కోసుకున్నారు. కొన్ని అంటుమామిడి కాయలు కోసుకున్నారు. నెమ్మదిగా బయటపడి సరదాగా నడుస్తూ తిన్నన్ని తిన్నారు, కొన్ని పండ్లు కొరికి కాలువలోకి విసిరారు. కొన్ని ఇండ్లకు తెచ్చుకున్నారు. ఇక రోజూ అలా కాలువ గట్టుకు పోవడం రామయ్య తోటలోపడి దొంగతనంగా పళ్ళూ కాయలు పువ్వులు కోసుకుపోవడం వారి దినచర్యగా మారిపోయింది.

తనతోటలోని పండ్లు దిగుబడి తగ్గిపోవడం రామయ్య గమనించాడు. ఒకరోజు ఆ ముగ్గుర్నీ పండ్లు కోసుకుంటుండగా చూశాడు. అయితే ఆ ముగ్గురి తండ్రులూ బాగా పలుకుబడి గలవారు. అందుచే ఆ పిల్లలను ఏమీ చేయలేక వదిలేశాడు. కాని ఇలా ఎన్ని రోజులు? చివరకు రామయ్య బాగా ఆలోచించి వారి స్కూలికి క్రొత్తగా వచ్చిన సత్యం మాష్టారికి వీళ్ళ సంగతి చెప్పి, ఎలాగైనా మంచిగా ఆ పిల్లల అల్లరి మాన్పించమని ప్రతిమాలుకున్నాడు. సత్యం మాష్టారు సరేనన్నారు.

సత్యం మాష్టారు రామయ్యకైతే మాటిచ్చారు గాని దాన్ని ఎలా నిలబెట్టుకోవాలో వారికే అర్థం గాకుండా ఉంది. బుద్ధిగా తలవంచుకుని పాఠం వ్రాసుకుంటున్న రాజా, రాము, రవిలను చూస్తున్న సత్యం మాష్టారు బుర్రలో తళుక్కున నో ఉపాయం తట్టింది. అంతే మాష్టారు అందరు పిల్లలను పుస్తకాలు మూసేయమన్నారు. 'ఈరోజుమనం తోటపని చేద్దాం పదండి' అని పిల్లలందరినీ బడి ముందున్న తోటలోనికి తీసుకొచ్చారు.

మాష్టారు ముందు తోటలో ఉన్న పనికిరాని మొక్కల్ని పీకేయమన్నారు. అంతే పిల్లలు కొద్ది నిమిషాల్లోనే కలుపు మొక్కలన్నీ పీకి ఒక పెద్ద కుప్ప వేశారు. తర్వాత మాష్టారు చెప్పగా పూల మొక్కలకున్న పురుగుల్ని వెతికి వెతికి చంపేశారు. మొక్కలకు పట్టిన చీడను దులిపేశారు. మొత్తానికి తోటంతా శుభ్రంగా చేశారు. అప్పుడు మాష్టారు పిల్లలందరినీ వరస క్రమంలో నిలబెట్టి నేను అడిగిన వాటికి సమాధానం చెప్పండి. అందరికన్నా ముందు రాజా చెప్పాలి.

"రాజా! ఈ మొక్కలన్నీ ఎందుకు పీకేశావ్?" అన్నారు కలుపు మొక్కల్ని చూపుతూ. "ఇవి పనికి రాని మొక్కలుగా! ఇవ్వివుంటే మంచి మంచి పూల మొక్కలకి నష్టం కాబట్టి పీకేశాం!" అన్నాడు రాజా.

"మరి ఇంత చిన్న మొక్కల్ని కూడా పీకేశారేం రాముా?" మాష్టారు చిన్న చిన్న మొక్కల్ని చూపుతూ అడిగారు.

"అవి ఎంత చిన్నవైనా పనికిరానివేగా మాష్టారు అందుకోసం పీకేశాం" అన్నాడు.

"మరి రవీ! నువ్వు పురుగుల్నెందుకు చంపావురా?" మాష్టారు రవిని అడిగారు.

"మాష్టారూ! పురుగులు మొక్కల్ని ఎదగనీకుండా ఆకులన్నీ తినేస్తాయి. అందుకు పురుగుల్ని చంపేశాం" అన్నాడు రవి.

"శేష్. మీరందరూ చాలా మంచి వాళ్ళోయ్. ఇప్పుడు చూడండి, ఈ కలుపు మొక్కల్లాగే మనుష్యుల్లో కూడా పనికిరాని మనుష్యులుంటారు."

"మనుష్యుల్లోనా మాష్టారూ!" పిల్లలందరూ ఒక్కసారిగా అడిగారు.

"అవును మనుష్యుల్లోనే. చూడండి దొంగలను మనము జేరనిస్తామా?! చేరనివ్వంగా! ఎందుకు జేరనివ్వం?"

"దొంగ కాబట్టి" అన్నారు పిల్లలందరూ.

"అవును సరిగ్గా చెప్పారు. అల్లరి చిల్లరి పనులు చేస్తూ దొంగతనాలు చేస్తూ చెప్పిన మాట వినకుండా తిరిగే వారిని ఎవరూ దగ్గరకు రానీయరు. వారితో స్నేహం చేయరు. వీళ్ళు పెద్దవాళ్ళయినా కూడా బుూ జద్దలు మూసుకోరు. అప్పుడు లోకం ఈ దొంగవాళ్ళని, చెడ్డవాళ్ళని చాలా దూరంగా ఉంచుతుంది. చీడపురుగుల్లాంటి ఈ మనుష్యుల్ని తరిమి తరిమి కొడుతుంది, జైళ్ళలో ఉంచుతుంది, నానా బాధలు పెడుతుంది. అదంతా మీకిష్టమా!?" అడిగారు మాష్టారు.

"లేదు మాష్టారు! మాకిష్టం లేదు. మేమంతా బాగా చదువుకొని మంచి మనుషులమవుతాం" అంటూ పిల్లలందరూ ఉత్సాహంతో అన్నారు.

"శభాష్ మీరంతా మన తోటలోని గులాబీ, చామంతి, మల్లె, మందారం లాంటి మంచి మొక్కల్లా తయారవాలి. మంచిని పెంచాలి. మంచిని ప్రేమించాలి. ఇప్పట్నుంచే మీలో ఉన్న చెడ్డగుణాల్ని వదిలిపెట్టుకోవాలి. మరి ఇవన్నీ మీరు చేస్తారా?

"తప్పకుండా మాష్టారు! మేం మంచివాళ్ళమవుతాం!" అన్నారు పిల్లలు ఉత్సాహంతో. మాష్టారు చెప్పగా పీకిన కలుపు మొక్కల్ని దూరంగా పడేశారు. కలుపు మొక్కలు నేర్పిన పాఠం రాజా, రాము, రవిల చిన్న మనస్సుల్లో దృఢంగా మంచి అనే బీజాన్ని నాటింది. ఆ నాటితో ఆ ముగ్గురు చిన్నారి మిత్రులు రామయ్య తోటలోకి పండ్లేకాదు, మరి ఎవరి చెట్టు పండ్లను దొంగతనంగా కోసుకోవడం లేదు. మంచి పిల్లలు అనిపించుకుంటూ చక్కగా చదువుకుంటున్నారు.

*